క్లుప్తంగా

ఘనంగా గీతా జయంతి



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలో గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం శ్రీకృష్ణుడి ఉత్సవ మూర్తిని పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు పరందాముడు, సుబ్బారావు, సుబ్బరాయుడు, పెద్దరెడ్డి, శివరామిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆశాల కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ నంద్యాల జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ శివబాలకృష్ణ తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సుధాలక్ష్మి, వేదవతి, ఉపాధ్యక్షులుగా ఉమ, ఆదిలక్ష్మి, వరలక్ష్మి, కోశాధికారిగా లక్ష్మీదేవి, సహాయ కార్యదర్శిగా ఉశేన్‌బీ, అరుణ, పుష్పలతతో పాటు 35 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఆర్థిక సాయం



శ్యామ్ తల్లికి నగదు అందజేస్తున్న ఎంపీడీఓ సావిత్రి

దొర్నిపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తాత్కలిక అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్యామ్‌రావు ఇటీవల గుండెపోటుతో మరణించాడు. ఈ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది, అధికారులు, సచివాలయ ఉద్యోగులు రూ.36,100 పోగు చేశారు. ఈ సొమ్మును ఎంపీడీఓ సావిత్రి.. శ్యామ్‌రావు తల్లి నాగలక్ష్మమ్మకు బుధవారం అందజేశారు. ఏఓ నారాయణమూర్తి, సిబ్బంది పద్మజ, వెంకటరమణ, కిశోర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగార్జున ఉన్నారు.

మధ్యంతరభృతి ప్రకటించాలి

నంద్యాల(న్యూటౌన్) : ఉపాధ్యాయులు, ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్‌టీయూ నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన, కార్యదర్శులు మౌలాలి, అజాంబేగ్ కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ రుణాలను ఫైనల్ పేమెంట్లను మంజూరు చేయాలని ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌టీయూ రాష్ట్రఅదనపు ప్రధానకార్యదర్శి శివశంకర్, కార్యదర్శులు గోపాలకృష్ణ, ఇక్బాల్ మాట్లాడుతూ ఉద్యోగసంఘాలను చర్చలకు పిలిపించి సమస్యలను పరిష్కరించాలన్నారు. చంద్రశేఖర్, కన్వీనర్ నాగేంద్రకుమార్, సుబ్బరాయుడు, వీరప్ప, బేతంచెర్ల మండల అధ్యక్షుడు నాగేశ్వరానాయక్ పాల్గొన్నారు.

పంట మార్పిడితోనే తెగుళ్ల నివారణ

ఉయ్యాలవాడ : రైతులు 30 సంవత్సరాలుగా రబీలో ఒకే పంట.. పప్పు శనగ సాగు చేస్తున్నారు. పంట మార్పిడి చేస్తేనే తప్పా తెగుళ్ల నివారణ సాధ్యం కాదని వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని కాకరవాడ గ్రామంలో రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో తెగుళ్ల ఆశించి దెబ్బతిన్న శనగ పంటను పరిశీలించారు. అధిక వర్షాలకు భూమిలో తేమశాతం ఎక్కువగా ఉండడంతో వేరు కుళ్లు, ఎండు తెగుళ్లు ఆశించాయన్నారు. వీటి నివారణకు సస్యరక్షణ పద్ధతులు చేపట్టాలని రైతులను కోరారు. ప్రతి సంవత్సరం రబీకి ముందు ఖరీఫ్‌లో 60 రోజులకు పంట దిగుబడులు వచ్చే కొర్ర, సజ్జలు తదితర చిరు ధాన్యాలు సాగు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ సునీత, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సోలార్ పరిశ్రమలో చోరీ

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో ఉన్న సోలార్ పరిశ్రమలో తీగల చోరీ జరిగింది. ఈ మేరకు కంపెనీ అధికారులు పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సోలార్ పరిశ్రమలో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. అలాగే ప్రజలతో మాట్లాడారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని చెప్పారు. చోరీ తీగెల విలువ భారీగా ఉంటుందన్నారు.

వేతన వెతలు

- 4 నెలలుగా వేతనాల కోసం ఎదురుచూపులు
- గత ప్రభుత్వంలో ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు
- వైఎస్సార్‌సీపీ ముద్రవేసి తొలగించిన వారికి జీతాలు పెట్టాల్సి వస్తుందనేనా?





పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

ఆళ్లగడ్డ: మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ కార్మికులకు 4 నెలలైనా జీతాలు చెల్లించకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. అసలే అరకొర వేతనం..అదీ నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆప్కాస్(ఏపీ కార్పొరేషన్ ఫర్ అవుట్ సోర్స్‌డ్ సర్వీసెస్) ద్వారా ప్రతి నెలా 1వ తేదీ ఠంచన్‌గా జీతాలు వచ్చేవి. అయితే టీడీపీ ప్రభుత్వంలో నాలుగు నెలలైనా వీరి జీతాల గురించి పట్టించుకోకపోవడం.. ఎప్పుడిస్తారనే విషయంపై స్పష్టత లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. కుటుంబాలను పోషించుకోవడానికి అవస్థలు పడుతున్నారు.

పండగల వేళ.. వేతనాల వేదన

ఆళ్లగడ్డ పురపాలక సంఘంలో ఆప్కాస్ ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో నియమితులైన 160 మంది పలు విభాగాల్లో వివిధ క్యాడర్లలో విధులు నిర్వహిస్తున్నారు. ఇందులో 90 మంది రోడ్ల వెంట కసువు ఊడ్చడం, మురుగు కాల్వలు శుభ్రపరచడం తదితర పారిశుద్ధ్య పనులు చేస్తున్నారు. ఎలక్ట్రీషియన్‌లు, వాటర్‌మెన్‌లు, బిల్ కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, సెక్షన్ ఆపరేటర్లుగా మరో 60 మంది ఉన్నారు. వీరికి క్యాడర్‌ను బట్టి రూ.15 వేలు నుంచి రూ.22,500 వరకు జీతం ఇస్తున్నారు. ఇలా మొత్తం నెలకు రూ.30 లక్షల లెక్కన నాలుగు నెలలకు రూ.1.20 కోట్లు వరకు జీతాలు చెల్లించాల్సి ఉంది. పారిశుద్ధ్య కార్మికుల్లో చాలా మంది డిసెంబర్ 25న వచ్చే క్రిస్మస్, జనవరి ఫస్ట్‌లను ఘనంగా జరుపుకుంటారు. పండుగల వేళ పస్తులతోనే సరిపెట్టుకోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోట్లలో నిధులు.. జీతాలకు పెట్టరు బిల్లులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే పెండింగ్ బిల్లులతో పాటు అత్యవసర అభివృద్ధి నిధులను 50- 50 (కాంట్రాక్టర్‌కు సగం అధికారులకు, పాలకులకు సగం) కింద పంచుకుని కోట్లాది రూపాయల నిధులు డ్రా చేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే కొన్ని పనులు చేయకుండానే చేసినట్లుగా రికార్డులు చూపించి ప్రభుత్వ నిధులు బొక్కేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఇందులో నుంచి కనీసం ఒక్క నెల జీతమైనా కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. వచ్చిన నిధులన్నీ వెంటవెంటనే కాంట్రాక్టర్లకు కట్టబెడుతున్నారే తప్ప నిరుపేదలైన కార్మికుల గురించి అధికారులు.. పాలకులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వారికి జీతాలు పెట్టాల్సి వస్తుందనేనా..?

అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న 22 మంది అవుట్ సోర్సింగ్ కార్మికులను నిర్ధాక్షిణ్యంగా తొలగించారు. వారిలో 25



ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయం

నుంచి 30 ఏళ్లగా పనిచేసిన చిరుద్యోగులు సైతం ఉన్నారు. వీరంతా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులని ముద్రవేసి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా మీరంతా విధులకు రావద్దని ఎమ్మెల్యే చెప్పమన్నారని అప్పటి కమిషనర్ అనడంతో అంతా అవాక్కయ్యారు. వీరంతా ఒక్కొక్కరుగా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో జిల్లా అధికారులు వీరిని విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లోకి తీసుకున్నా వీరికి పనులు చెప్పడం లేదు. అటెండెన్స్ కూడా తీసుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి మాత్రం జీతాలు పెట్టి తొలగించిన వారికి జీతాలు పెట్టకపోతే వారు మళ్లీ కోర్టుకు వెళ్లే అవకాశం ఉందనే తాత్సారం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వారు ఉన్నట్టా.. లేనట్టా..?

వైఎస్సార్‌సీపీ ముద్రవేసి తొలగించిన 22 మంది స్థానంలో టీడీపీకి చెందిన 22 మందిని కమిషనర్ వెంటనే విధుల్లోకి తీసుకుని వారికి అదే రోజు సీట్లు కూడా కేటాయించారు. ఇందుకు ఒక్కో అభ్యర్థి నుంచి రూ.2 లక్షల చొప్పున అధికార నాయకుడికి చెల్లించినట్లు బహిరంగ చర్చ జరిగింది. అయితే వీరందరిని విధుల్లోకి తీసుకున్నట్లు పురపాలక పాలకవర్గం తీర్మాణమే చేయకపోవడంతో వీరి ఫైల్ ఆప్కాస్‌కే పంపలేదు. పాత వాళ్లకు జీతాలు పెడితే మాకు ఎందుకు పెట్టలేదని నిలదీస్తారన్న భయంతోనే ఎవరికీ జీతాలు పెట్టలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక నెల జీతం కూడా పెట్టకపోవడంతో తాము ఉద్యోగంలో ఉన్నాట్టా.. లేనట్టా అని అంతర్గతంగా మదనపడుతున్నారు.

ఎలా బతకాలి



మాకు నెలకు రూ.20 వేల వరకు జీతం వస్తుంది. ప్రతి నెలా జీతం వస్తేనే బియ్యం, పాలు, గ్యాస్, డిష్, ఫోన్ బిల్లు, పిల్లల స్కూల్, కాలేజీ ఫీజులు తదితర అవసరాలు తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాం. అలాంటిది నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకుంటే ఎలా బతకాలి. చేతిలో చిల్లిగవ్వ లేదు. వరుసగా పండుగలు వస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో అర్థం కావడం లేదు.

–రాజు, పారిశుద్ధ్య కార్మికుడు, ఆళ్లగడ్డ

అప్పులకు తిప్పలు

జీతాలు అందక సుమారు నాలుగు నెలలు అవుతోంది. ఇంట్లో జరగడానికే ఇబ్బందిగా ఉంది. ఈ క్రమంలోనే క్రిస్మస్, జనవరి ఫస్ట్ వస్తోంది. పిల్లలకు కొత్త బట్టలు తీసుకునేందుకు.. సరుకులు తెచ్చుకునేందుకు మూడు రోజుల క్రితం రూ.5 వడ్డీతో రూ.15 వేలు అప్పు తెచ్చుకున్నా. నాలాగే అందరూ అప్పుల కోసం తిప్పలు పడుతున్నారు.

–సుబ్బరాయుడు, పారిశుద్ధ్య కార్మికుడు

కూలీలు లేకుండా గ్రామ సభ

- మొక్కలు నాటకుండా రూ.62,368 స్వాహా



గొట్లూరులో నిర్వహించిన సోషల్ ఆడిట్ గ్రామ సభలో కూలీలు లేని దృశ్యం

చాగలమర్రి: మండలంలోని గొట్లూరు, కదిరిపురం తండా గ్రామాల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనులకు సంబంధించి ఈ నెల 8 నుంచి 11వ తేది వరకు 18వ విడత సోషల్ ఆడిట్ నిర్వహించి, ఎస్‌ఆర్‌పీ మురాద్ ఆధ్వర్యంలో బుధవారం గొట్లూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహిచారు. అయితే ఈ సభకు ఉపాధి సిబ్బంది మాత్రమే హాజరు కాగా.. కూలీలు రాకపోవడం గమనార్హం. గ్రామంలో ఈ ఏడాది నిర్వహించిన 17 పనులకు గాను సుమారు రూ.24 లక్షలకు పైగా నిధులు మంజురు చేశారి ఎస్‌ఆర్‌పీ మురాద్ తెలిపారు. వాటిలో 9 కాలువ పనులు, 5 ఉద్యానవన శాఖ సంబంధిత పనులు, 2 మిని గోకులాల పనులుగా గుర్తించామన్నారు. ఉద్యానవన పనులకు రైతులు సంజీవయ్య, చెన్న కేశవ, ఉశేన్‌బీ, పాఠశాల వద్ద మొక్కలు నాటేందుకు రూ.62,368 మంజూరు చేసినట్లు రికార్డులు ఉన్నాయి. కానీ వారి పొలం, పాఠశాల వద్ద మొక్కలు లేవని తెలిపారు. చేసిన పనులకు నేమ్ బోర్డులు ఏర్పాటు చేయలేదు. మైనర్ కెనాల్ నిర్మాణాలకు కేసీ కెనాల్ అధికారులతో మంజూరు ఉత్తర్వులు పొందలేదన్నారు. ఉపసర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, జమాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నాగార్జున, ఏపీఓ నిర్మల పాల్గొన్నారు.

తదిరిపురం తండా గ్రామ సభ వాయిదా..

గ్రామ సభ నిర్వహించడానికి అధికారులు కదిరిపురం తండాకు వెళ్లారు. ఇక్కడ గ్రామ పంచాయితీ కార్యాలయంలో లేక పోవడంతో సేవాలాల్ నాయక్ ఆలయం వద్ద నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తుండగా కొందరు టీడీపీ నాయకులు సభ నిర్వహించకూడదని సర్పంచ్ రామ్లా నాయక్, సోషియల్ ఆడిట్ సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో సభను వాయిదా వేశారు.

ఆళ్లగడ్డ కమిషనర్‌గా కిశోర్

సాక్షి ఎఫెక్ట్

ఆళ్లగడ్డ: ఎట్టకేలకు ఆళ్లగడ్డ పురపాలక సంఘానికి ప్రభుత్వం కమిషనర్‌ను నియమించింది. సుమారు నెల రోజులుగా కమిషనర్ లేక పోవడంతో ఉద్యోగుల జీతాలు ఆగిపోవడం, డీజిల్ లేక చెత్త తరలించే వాహనాలు సైతం నిలిచి పోయాయని ఈ నెల 6న సాక్షిలో పడకేసిన 'పుర'పాలన అనే శీర్షికన అని వెలువడిన కథనానికి స్పందించిన ప్రభుత్వం కడప కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కిశోర్‌ను ఇక్కడకు కమిషనర్‌గా నియమించింది. ఈ మేరకు బుధవారం ఆళ్లగడ్డ మున్సిపల్ కార్యాలయం చేరుకున్న కిశోర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

ఉయ్యాలవాడ : రైతులు భూ సమస్యలను గ్రామ సభల ద్వారా పరిష్కరించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు కోరారు. బుధవారం మండలంలోని అల్లూరు, ఎస్.కొత్తపల్లె గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రీసర్వేలో నెలకొన్న కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో మార్పులు, విస్తీర్ణంలో నెలకొన్న సమస్యలపై 36 మంది రైతులు అర్జీలు అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. మండల సర్వేయర్ విజయలక్ష్మి, దేవదాయశాఖ అధికారులు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

శిరివెళ్ల: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషలాఫీర్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక సచివాలయంలో రెవెన్యూ సదస్సు జరిగింది. 15 మంది రైతులు అర్జీలు అందజేశారు. తహసీల్దార్ పుష్పకుమారి, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్, సర్వేయర్ చిన్న మల్లయ్య పాల్గొన్నారు.



పాసుపుస్తకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సుభద్ర

దొర్నిపాడు: మండంలోని రామచంద్రాపురంలో తహసీల్దార్ సుభద్ర స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామ రెవెన్యూ సభ నిర్వహించారు. ఈసందర్భంగా రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.డిప్యూటీ తహసీల్దార్ మాధవ, ఈఓ చంద్రుడు, వీఆర్‌ఓ నారాయణస్వామి పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టండి



తోడేండ్లపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రంగనేతాజీ

చాగలమర్రి: రబీలో సాగు చేసిన పంటలను రక్షించుకునేందుకు రైతులు సస్యరక్షణ పద్ధతులు చేపట్టాలని ఏఓ రంగనేతాజీ సూచించారు. బుధవారం మండలంలోని తోడేండ్లపల్లె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాలకు మినుము పంట ఎత్తుగా పెరిగినా.. పూత తక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున, పూత వచ్చేందుకు ప్లానోఫిక్స్ మందును పిచికారీ చేయాలని చెప్పారు. మినుము, వరి, శనగ పంటల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వరి,జొన్న, ఉల్లి పంటలకు పంటల బీమాకు రైతులు తమ వాటా ప్రీమియం చెల్లించటానికి ఈ నెల 15వ తేదీ ఆఖరని చెప్పారు.

- 13న జరిగే 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' విజయవంతం చేద్దాం
- మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబున్నీసా, శశికళా రెడ్డి పిలుపు

రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నంద్యాల(రూరల్): అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందని నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీ సా, పార్టీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు డాక్టర్ శశికళ రెడ్డి పేర్కొన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు స్థానిక పార్టీ కార్యాలయంలో 'అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ' పేరుతో రూపొందించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పేరుతో రూ.20వేలు ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదుని, నాణ్యమైన విత్తనాలు, మందులు అందజేయలేదని, పంటలకు గిట్టుబాటు ధరలు అందజేయకపోవడంతో నష్టాలు మూటగట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాలకు పంటలు కోల్పోయిన రైతులకు పరిహారం అందించి కోవాల్సి ఉండగా.. నేటి వరకు పరిహారం మాటెత్తలేదని వీటన్నింటి పరిష్కారం కోసం ఈ నెల 13వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేసి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ఇందుకు జిల్లాలోని రైతులు, పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్లు, నాయకులు దేశం సుధాకర్‌రెడ్డి, సాధిక్ బాషా, కలాం, చంద్రశేఖర్‌రెడ్డి, మేస చంద్రశేఖర్, ఆరిఫ్ నాయక్, సాయిరాంరెడ్డి, దాల్మిల్ అమీర్, రామచంద్రుడు, జాకీర్ హుస్సేన్, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, బసవేశ్వర రెడ్డి,, భాస్కర్ రెడ్డి, దండె సుధాకర్, సోమశేఖర్‌రెడ్డి, ఖాసిం, షేక్ రహంతుల్లా, దేవనగర్ బాషా, ఎరన్న, కాల్వనాగరాజు పాల్గొన్నారు.

అన్నదాతలను నట్టేట ముంచిన కూటమి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, నాయకులు

ఆళ్లగడ్డ: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం అన్నదాతలను నట్టేట ముంచిందని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి విమర్శించారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ×అన్నదాతకు అండగా₹ ర్యాలీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు ఇప్పటివరకు ఆ ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో దళారులు ఇష్టమొచ్చిన ధర నిర్ణయించి కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్ట పోతున్నారన్నారు. వరి ధర గత ప్రభుత్వంలో రూ.2వేల నుంచి రూ. 2,200 ఉండగా..ప్రస్తుతం రూ.1,200 నుంచి రూ.1,400 కు తగ్గిని చర్యలకు పూనుకోకపోవడం దారుణమన్నారు. గత ఐదేళ్ల పాటు పంటల బీమా భారాన్ని ప్రభుత్వమే భరించగా.. నేడు రైతులే ప్రీమియం చెల్లించాలని చెప్పడం సరికాదన్నారు. భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు పరిహారమిచ్చి ఆదుకోవాలనే ధ్యాస లేదని మండిపడ్డారు. రైతులకు అండగా నిలవాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 13వ తేదీ నంద్యాల కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే నిరసన కార్యక్రమానికి రైతులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. అందరం సమైక్యంగా గళమెత్తి ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దామని చెప్పారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, నాయకులు గంగుల విజయసింహారెడ్డి, గంధం రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, శివనాగిరెడ్డి, గంగుల రామిరెడ్డి పాల్గొన్నారు.

14న సాగు నీటి సంఘాల ఎన్నికలు

ఉయ్యాలవాడ : మండలంలోని 9 సాగు నీటి సంఘాలకు ఈ నెల 14వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తామని తహసీల్దార్ శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని చెరువులు, కేసీ కాలువ, ఎస్సార్బీసీ ఆయకట్టు కింద 62 డబ్ల్యూఏ (టీసీ)లున్నాయి. వీటికి ఎన్నికలు నిర్వహించవలసి ఉండగా పీఓ, ఏపీఓలతో కలిసి 200 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటారన్నారు. ఎన్నికలు జరగనున్న తుడుమలదిన్నె, రూపనగుడి, హరివరం, ఉయ్యాలవాడ, పెద్దయమ్మనూరు, మాయలూరు, అల్లూరు గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, మోడల్‌స్కూల్‌లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

దొర్నిపాడు: పంట సాగుకు ముందు విత్తనశుద్ధి ఎంతో ముఖ్యమని మండల వ్యవసాయాధికారి ప్రమీల సూచించారు. బుధవారం మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనశుద్ధి అవశ్యకతను వివరించారు. రైతులు రసాయన ఎరువులు, మందులను తగ్గించి సేంద్రియ సాగుకు శ్రీకారం చుట్టాలని చెప్పారు. శనగ పంటలో చీడపీడలు, వాటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. శనగపంటకు ముందు పంటమార్పిడి కూడా అవసరమన్నారు. కార్యక్రమంలో వీఏఏలు వినోద్, వంశీ పాల్గొన్నారు.

ఒక శాతం లేబర్ సెస్ చెల్లించాలి

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

నంద్యాల: అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న నిర్మాణ పనులకు చెందిన కాంట్రాక్టర్‌కు చెల్లించే సొమ్ములో ఒక శాతం లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించే అంశంపై సంబంధిత అధికారులతో జేసీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్‌విష్ణు చరణ్ మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయంతో ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెప్పించుకుని డేటా బేస్ ఏర్పాటు చేసుకోవాలని కార్మిక శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి నిర్మాణ సంస్థ చట్టాన్ని అనుసరించి విధిగా మీసేవలోగాని, ఆన్‌లైన్ ద్వారా కానీ రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ప్రభుత్వ నిర్మాణ పనులు అమలు చేసే ప్రభుత్వ శాఖల అధికారులు, బిల్డింగ్ ప్లానులు అప్రూవల్ చేసే సంస్థలైన మున్సిపల్ కార్పొరేషన్, పంచాయతీరాజ్, ఏపీఐఐసీలకు చెందిన సంస్థలు ఒక శాతం లేబర్ సెస్ కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించే అంశంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్, ఉప కమిషనర్ వెంకటేశ్వర్లు, సహాయ కార్మిక కమిషనరు బషీరున్నిసా బేగం, ఆర్‌అండ్ బి ఎస్‌ఈ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఇరిగేషన్ ఎస్‌ఈ సుబ్బరాయుడు, జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి

నంద్యాల (అర్బన్) : తమ హక్కులపై మహిళలు అవగాహన పెంచుకోవాలని నంద్యాల ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ చంద్రకళ తెలిపారు. స్థానిక ఎన్‌జీవోస్ కాలనీలోని కిశోర వికాసం ట్రైనింగ్ కో-ఆపరేటివ్ సెంటర్‌లో బుధవారం కిశోరీ వికాసంపై మండల స్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం గురించి బాలింతలు తెలుసుకుని చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కిశో వికాసానికి సంబంధించిన గోడ పత్రికను ఎంఈఓ బ్రహ్మం నాయక్, ఐసీడీఎస్ అధికారులతో కలిసి విడుదల చేశారు.

తెగని వివాదం..ఆగిన సీసీ రోడ్డు నిర్మాణం

దొర్నిపాడు: మూడు దశాబ్దాల క్రితం మండలంలోని క్రిష్టిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీవాసులకు ప్రభుత్వం పేదలకు ఇళ్ల పట్టాల కోసం భూమిని సేకరించింది. ఇందులో భాగంగా ఓ రైతుకు చెందిన పొలం సమీపంలోనే పట్టాలను పంపిణీ చేశారు. ఇంకా మిగులు స్థలంలో 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. ఇందులో భాగంగా లేఅవుట్ రూపొందించి రహదారులను కూడా ఏర్పాటు చేసి ప్లాట్లు వేసి అప్పట్లో పట్టాలు అందజేయగా లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఎస్సీ కాలనీలో కూటమి ప్రభుత్వం రూ.10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను మొదలు పెట్టింది. ఇందులో భాగంగా కాలనీలో సీసీరోడ్ల నిర్మాణ పనులకు సదరు కాంట్రక్టరు చదును చేసి గ్రావెల్ పరిచి సిద్ధం చేశాడు. ఇంతలో ఇక్కడ రహదారి లేదని రోడ్డు వేయరాదని, తన పొలం హద్దులు చూపాలని ఓ రైతు అడ్డు పడటంతో పుల్లయ్య ఇంటి ముందు వెళ్లే సీసీ రోడ్డు వేసేందుకు నిరాకరించారు. గతంలో రెవెన్యూ అధికారులు తమకు పట్టాలు ఇచ్చి ఇప్పుడు రస్తా లేదంటే ఎలా అని కాలనీ వాసులు వాపోతున్నారు. 2014–2019లో అదే లైన్‌లో సీసీ రోడ్డు వేశారని, ఇప్పుడు అడ్డుపడటంలో ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. దీంతో రోడ్డుపై వివాదం రేగుతుంది. ఇరవై ఏళ్ల నుంచి సీసీరోడ్డు లేదని ఇప్పుడు వస్తే ఇలా అడ్డుపడ్డతారని పుల్లయ్య, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



వివాదంలో ఉన్న రహదారి

బాలికల భద్రతపై కమిటీలు



శిక్షణ ఇస్తున్న సీడీపీఓ తేజస్విని

శిరివెళ్ల: బాలికల (కిషోరి వికాసం) భద్రతపై కమిటీలు ఏర్పాటు చేశామని ఐసీడీఎస్ సీడీపీఓ తేజస్విని అన్నారు. బుధవారం స్థానిఎ ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ సచివాలయాల కమిటీలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బాలికల భద్రత, సంరక్షణ, విద్యపై కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో హెచ్‌ఎంలు, మహిళా పోలీస్, అంగన్‌వాడీ టీచర్, ప్రభుత్వ మహిళా టీచర్, సోషల్ వెల్ఫేర్‌తో కూడిన కమిటీ ఏర్పాటైందన్నారు. వారు బాలికల సంరక్షణ, భద్రత, విద్యపై తల్లిదండ్రులకు శిక్షణ ఇస్తారన్నారన్నారు. బాల్య వివాహాలు, మహిళల భద్రతపై కూడ కమిటీలు చైతన్య పరుస్తాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగినుల భద్రతపై ఆయా కార్యాలయాల అధిపతులు, మహిళలతో కమిటీలు రూపొందించామని చెప్పారు. శిక్షణలో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.